సాక్షి
అనంతపురం
సోమవారం । 20 । మే । 2024



ఊపందుకున్న ఉపాధి

జిల్లాలో ఉపాధి పనులు ఊపందుకున్నాయి. కూలీలు సద్వినియోగం చేసుకుంటూ ఉన్న ఊరిలోనే ఉపాధి పొందుతున్నారు. 8లో



కన్నతల్లిపై కొడవలితో దాడి

కన్నతల్లి పట్ల కుమారుడు కర్కశంగా ప్రవర్తించాడు. కొడవలితో దాడి చేశాడు. రాయదుర్గంలో ఈ ఘటన జరిగింది. 8లో

గరిష్టం/కనిష్టం
38.1°/23.6°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ. వేగంతో వడగాల్పులు వీచాయి.

న్యూస్‌రీల్

గుత్తిలో భారీ వర్షం

- 81.2 మి.మీ వర్షపాతం నమోదు



గుత్తి వీధుల్లో పారుతున్న వర్షపు నీరు

అనంతపురం అగ్రికల్చర్: గుత్తిలో భారీ వర్షం కురిసింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు జిల్లాలోని 12 మండలాల పరిధిలో 7.9 మి.మీ సగటు వర్షపాతం నమోదు కాగా, గుత్తిలో ఏకంగా 81.2 మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే, రాయదుర్గం మండలంలో 42.6 మి.మీ, శెట్టూరు 38.4 మి.మీ, యల్లనూరు 35.8 మి.మీ, కుందుర్పి 20.6 మి.మీతో పాటు పుట్లూరు, డి.హీరేహాళ్, గుమ్మఘట్ట, కంబదూరు, రాప్తాడు, కణేకల్లు, ఆత్మకూరు తదితర మండలాల్లో మోస్తరు వర్షం పడింది. శ్రీ సత్యసాయి జిల్లాలో కూడా చాలా మండలాల్లో వర్షాలు కురిశాయి. బత్తలపల్లి, నల్లచెరువు, చిలమత్తూరు, ఓడీ చెరువు, పుట్టపర్తి, ముదిగుబ్బ, తలుపుల, బుక్కపట్నం, పరిగి, అమరాపురం, పెనుకొండ, తనకల్లు, రొద్దం, కదిరి, గుడిబండ తదితర మండలాల్లో వర్షపాతం నమోదైంది.

పనితీరు మార్చుకోకపోతే చర్యలు

- సబ్‌జైలు నిర్వహణపై జిల్లా జడ్జి శ్రీనివాస్ ఆగ్రహం



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాస్

హిందూపురం అర్బన్: పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని జిల్లా జడ్జి శ్రీనివాస్ జైలు సిబ్బందిని హెచ్చరించారు. ఖైదీలకు ఇవ్వాల్సిన గుర్తింపు కార్డులు, ఫైళ్ల నిర్వహణపై హిందూపురం సబ్‌జైలు సూపరింటెండెంట్ అంజి నాయక్‌పై అసహనం వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా జడ్జితో పాటు స్థానిక అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ సబ్‌జైలును తనిఖీ చేశారు. సబ్‌జైలులో ఎంత మంది ఖైదీలు ఉన్నారు.. గదుల్లో లైటింగ్, ఫ్యాను సదుపాయాలు, మరుగుదొడ్ల పరిశుభ్రతను పరిశీలించారు. వంట తయారీకి సరఫరా చేస్తున్న నిత్యావసరాలు, తాగునీటి సదుపాయంపై ఆరా తీశారు. అనంతరం ఖైదీలతో జిల్లాజడ్జి కాసేపు మాట్లాడారు. ఎవరికైనా న్యాయ సహాయం కావాలంటే దరఖాస్తు చేసుకుంటే తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు. సబ్ జైలులో హెడ్‌వార్డర్ హరినాథ్ మద్యం తాగి వచ్చినా ఎందుకు చర్యలు తీసుకోలేదని సూపరింటెండెంట్ అంజినాయక్‌ను ప్రశ్నించారు. మద్యం తాగి విధులకు హాజరైన హెడ్‌వార్డర్ హరినాథ్‌పై చర్యలకు సిఫార్సు చేయనున్నట్లు జిల్లా జడ్జి చెప్పారు. జిల్లా జడ్జి వెంట వివిధ కోర్టుల సూపరింటెండెంట్‌లు భాస్కర్, రాధాకృష్ణ, రామాంజనేయులు, లోక్ అదాలత్ హేమావతి ఉన్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు అవకాశం

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు తత్కాల్ కింద చెల్లించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అవకాశం ఉంటుందని ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి వెంకటరమణనాయక్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పరీక్ష ఫీజుతో పాటు తత్కాల్ కింద రూ. 3 వేలు అదనంగా చెల్లించాల్సి ఉంటుందని, ఆయా ప్రిన్సిపాళ్లను కలిసి ఫీజు చెల్లించాలని కోరారు.

24న డీఈఈ సెట్



అనంతపురం ఎడ్యుకేషన్: డీఈఈసెట్–2024 ఈనెల 24న ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష సాగుతుందన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్లను https// cse. ap. gov.in, https// apdeecet. apcfss. in వెబ్‌సైట్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అనంతపురం నగర శివారులోని చిన్మయానగర్ ఎల్ఆర్‌జీ స్కూల్ పక్కన ఉన్న నేషనల్ కౌన్సిల్ ఫర్ చర్చ్ సోషియల్ యాక్షన్ ఇండియా భవనాన్ని పరీక్ష కేంద్రంగా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అభ్యర్థులు గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. హాల్‌టికెట్‌లో ఫొటో రానివారు ఒక పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో పాటు ప్రభుత్వ గుర్తింపు ఉన్న ఆధార్‌కార్డు, పాన్‌కార్డు లేదా డ్రైవింగ్ లైసెన్స్ వెంట తీసుకురావాలన్నారు. సందేహాలుంటే 80303 04869 నంబరులో సంప్రదించాలని సూచించారు.



ఆకాశంలో సగం, అన్నింటా భాగం అనే నానుడిని వారు నిరూపిస్తున్నారు. కారడవుల్లోనూ ఆత్మస్థైర్యాన్ని కూడగట్టుకుని ముందుకు సాగుతున్నారు. 'వనిత'ర సాధ్యులమని నిరూపిస్తున్నారు. అడవులు, వన్యప్రాణుల పరిరక్షణలో తమదైన ముద్ర వేసుకుంటున్నారు. బిడ్డలను తల్లి కంటికి రెప్పలా రక్షించుకున్నట్లుగా వనాలను సంరక్షిస్తున్నారు. అటవీ భూముల పరిరక్షణలో సింహాలై గర్జిస్తున్నారు. పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

వనంలో వనితర సాధ్యులు

అనంతపురం జిల్లాలోని ఫారెస్ట్ డివిజన్లు	అనంతపురం, కళ్యాణదుర్గం, గుత్తి
అటవీ విస్తీర్ణం	74,462 హెక్టార్లు
మొత్తం అటవీ సిబ్బంది	64 మంది

శ్రీ సత్యసాయి జిల్లాలో ఫారెస్ట్ డివిజన్లు	కదిరి, బుక్కపట్నం, పెనుకొండ
అటవీ విస్తీర్ణం	1,25,223.700 హెక్టార్లు
మొత్తం అటవీ సిబ్బంది	102 మంది

- అటవీ శాఖలోనూ మగువల తెగువ
- వివిధ బాధ్యతల్లో తమదైన ముద్ర
- వన్యప్రాణులు, అడవుల సంరక్షణలో కీలక పాత్ర
- సవాళ్లను సైతం దీటుగా ఎదుర్కొంటూ ముందుకు..



వన్యప్రాణుల దాహం తీర్చేందుకు శెట్టూరు బీట్‌లో తొట్టెల్లో నీరు నింపుతున్న ఏబీఓ తిమ్మక్క



రాయలచెరువు వద్ద అటవీ భూముల అన్యాక్రాంతంపై హెచ్చరికలు జారీ చేస్తున్న ఉద్యోగి మాధవి (ఫైల్)

పురుషులతో సమానంగా విధులు



మా సొంతూరు ఆత్మకూరు. ప్రస్తుతం రాయలచెరువు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నా. పురుష ఉద్యోగులతో సమానంగా రాత్రిళ్లు పెట్రోలింగ్ నిర్వహించా. అత్యవసర పరిస్థితుల్లో చాలా సార్లు అడవుల్లోకి ఒంటరిగా కూడా వెళ్లా. అటవీ భూములను ఆక్రమించిన వారిపై ఉక్కుపాదం మోపి వెనక్కి తీసుకువచ్చా.

– మాధవి, ఎఫ్‌బీఓ, రాయలచెరువు

రాయదుర్గం: అటవీ శాఖలో ఉద్యోగం చేయడం కత్తిమీద సాములాంటిదే. చిరుత పులులు, ఎలుగు బంట్లు వంటి క్రూరమృగాలకు నిలయమైన అటవీ ప్రాంతాల్లో ఉద్యోగం అంటే ఎవరైనా భయపడాల్సిన పరిస్థితి. అయితే, మారిన కాలానికి అనుగుణంగా అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణిస్తున్న మహిళలు.. కష్టసాధ్యమైన ఈ పనిలోకీ ధైర్యంగా అడుగేస్తున్నారు. సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనంతపురం, గుత్తి, కళ్యాణదుర్గం, కదిరి, బుక్కపట్నం, పెనుకొండ తదితర ఆరు ఫారెస్ట్ రేంజ్ డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 73 బీట్‌లు ఉండగా, 1,99,685 హెక్టార్లలో అడవులు విస్తరించాయి. వివిధ విభాగాల్లో 166 మంది ఉద్యోగులు ఉన్నారు. క్షేత్రస్థాయిలో ఎఫ్‌బీఓ, ఎఫ్ఎస్ఓ, ఎఫ్‌డీఆర్వో, ఎఫ్ఆర్వో తదితర ఉద్యోగాల్లో సుమారు ఇరవై మందికి పైగా మహిళలు విధులు నిర్వర్తిస్తున్నారు. నిర్భయంగా పనిచేస్తూ ప్రశంసలు పొందుతున్నారు.

వన్యప్రాణులపై మమకారం



వన్యప్రాణులు, చెట్లపై మమకారంతో 2011లో ఉద్యోగంలో చేరా. జిల్లాలోని వివిధ బీట్‌లలో విధులు నిర్వర్తించా. ప్రస్తుతం నాగసముద్రం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా ఉన్నా. కంటికి రెప్పలా అడవులను సంరక్షించుకుంటున్నాం. ఉమ్మడి జిల్లాలోని అటవీ గ్రామాల ప్రజలు చాలా మంచి వారు. మాకు ఎంతగానో సహకరిస్తున్నారు.

– రాజేశ్వరి, ఎఫ్‌బీఓ

కష్టమైనా ఇష్టంగానే..



రాయదుర్గం ధర్మపురి ఫారెస్ట్‌లో చాలా కాలం విధులు నిర్వర్తించా. కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేశా. అటవీ సంరక్షణపై మక్కువతో సొంతంగా ఆరు వేల విత్తన బాల్స్ తయారు చేయించి మారెంపల్లి ఫారెస్ట్‌లో గత ఖరీఫ్‌లో చల్లించా. అందులో చాలా విత్తనాలు పెరిగి పెద్దవి కావడం సంతోషాన్నిస్తోంది. ఇటీవల అడవిలో కార్చిచ్చు చెలరేగిన సమయాన మంటలను అదుపులోకి తెచ్చేందుకు అర్ధరాత్రి వరకూ అక్కడే గడిపాం. కష్టమైనా ఇష్టంగా విధులు నిర్వర్తిస్తున్నా. – తిమ్మక్క, ఏబీఓ, శెట్టూరు

అర్ధరాత్రైనా వెనకడుగేయం



నేను విధులు నిర్వర్తిస్తున్న అటవీ విస్తీర్ణం చాలా పెద్దది. విధుల్లో భాగంలో అడవిలోకి వెళ్లినప్పుడు ఒక్కోసారి సెల్‌ఫోన్ సిగ్నల్స్ కూడా సక్రమంగా అందవు. చిరుతలు, ఎలుగుబంట్లు సంచరిస్తున్నా ప్రాణాలను పణంగా పెట్టి చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తున్నా. కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేశా. అటవీ శాఖలో పని చేయడంతో ఎంతో ధైర్యం వచ్చింది. అర్ధరాత్రైనా అవలీలగా ఎక్కడికైనా వెళ్లి ధైర్యంగా విధులు పూర్తి చేసుకువస్తున్నా.

– ఆర్. స్రవంతి, ఎఫ్‌బీఓ, కదిరి

ఖరీఫ్ సాగు అంచనా @ 3,46,727 హెక్టార్లు

- జూన్ నుంచి 'ముంగారు'
- విత్తన పంపిణీ, ఎరువుల సరఫరాపై అధికార యంత్రాంగం దృష్టి



యాడికి సమీపంలో సాగుకు సిద్ధంగా పొలం

అనంతపురం అగ్రికల్చర్: జూన్ నుంచి ప్రారంభం కానున్న ఖరీఫ్–2024 సాధారణ సాగు విస్తీర్ణం గణాంకాలు అధికారికంగా వెల్లడయ్యాయి. గత ఐదేళ్ల పంటల సాగు ఆధారంగా ప్రణాళికశాఖ, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఈ ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం అంచనాలు సిద్ధం చేశారు. ఆ మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈ ఖరీఫ్‌లో అన్ని పంటలు కలిపి 3,46,727 హెక్టార్ల (8,66,817 ఎకరాలు)లో సాగులోకి రావొచ్చు. ప్రధానపంట వేరుశనగ 1,97,884 హెక్టార్లు (4,94,710 ఎకరాలు) ఉండగా ఆ తర్వాతి స్థానాల్లో పత్తి 48,586 హెక్టార్లు, కంది 37,367 హెక్టార్లు, ఆముదం 16,340 హెక్టార్లు, మొక్కజొన్న 11,554 హెక్టార్లు ఉండవచ్చు. నీటి వసతి కింద 18,299 హెక్టార్లలో వరి నాట్లు వేసే అవకాశం ఉంది. 20 రకాల పంటలు వర్షాధారంగా సాగు చేయడానికి రైతులు సిద్ధంగా ఉన్నారు. కాగా గతేడాది ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున 3.70 లక్షల హెక్టార్ల సాధారణ సాగుకు గానూ 2.73 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు సాగయ్యాయి.

సేద్యం పనుల్లో రైతులు నిమగ్నం..

జూన్ నుంచి సెప్టెంబర్ వరకూ మధ్య కాలాన్ని ఖరీఫ్‌గా పరిగణిస్తారు. జూన్ ఒకటి నుంచి అధికారికంగా ఖరీఫ్ (ముంగారు) ప్రారంభం కానుంది. ఇటీవల జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడటంతో రైతులు సేద్యపు పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ సారి కీలకమైన నైరుతి రుతుపవనాలు నాలుగైదు రోజులు ముందుగానే పలకరించే అవకాశం ఉన్నట్లు భారత వాతావరణ శాఖ ఇదివరకే ప్రకటించింది. జూన్ 10వ తేదీకి అటుఇటుగా 'నైరుతి' ప్రవేశించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. జిల్లా వార్షిక సాధారణ వర్షపాతం 512.4 మి.మీ కాగా అందులో కీలకమైన ఖరీఫ్ నాలుగు నెలల కాలంలో 319.7 మి.మీ నమోదు కావాల్సి ఉంటుంది. జూన్‌లో 61 మి.మీ, జూలైలో 63.9 మి.మీ, ఆగస్టులో 83.8 మి.మీ, సెప్టెంబర్‌లో 110.9 మి.మీ సాధారణ వర్షపాతంగా నిర్ధారించారు.

విత్తన పంపిణీపై దృష్టి..

ఎన్నికల కమిషన్ అనుమతి మేరకు వ్యవసాయశాఖ కమిషనరేట్ నుంచి ఇప్పటికే 40 శాతం రాయితీతో విత్తన వేరుశనగ, 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాల (గ్రీన్‌మెన్యూర్స్ సీడ్) పంపిణీకి వ్యవసాయ శాఖ, ఏపీ సీడ్స్ ఏర్పాట్లు చేస్తోంది. ఖరీఫ్‌లో లక్ష మెట్రిక్ టన్నుల మేర వివిధ రకాల ఎరువుల సరఫరాకు ప్రణాళిక రచించారు. అలాగే కందులు, కొర్రలు, రాగులు తదితర విత్తనాల సరఫరాపై దృష్టి సారించారు. వేరుశనగతో పాటు ప్రధాన పంటలు విత్తుకునేందుకు జూన్ 15 నుంచి జూలై ఆఖరు వరకు సరైన సమయమని ఏఆర్ఎస్, కేవీకే ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ బి.సహదేవరెడ్డి, డాక్టర్ జి.నారాయణ స్వామి, డాక్టర్ సాధినేని మల్లీశ్వరి తెలిపారు.

2024 ఖరీఫ్‌లో పంటల వారీగా సాధారణ సాగు విస్తీర్ణం అంచనాలు ఇలా:

పంట	విస్తీర్ణం (హెక్టార్లలో)
వేరుశనగ	1,97,884
వరి	18,299
కంది	36,367
పత్తి	48,586
ఆముదం	16,340
మొక్కజొన్న	11,554
జొన్న	5,036
సజ్జ	1,610
రాగి	81
కొర్ర	2,001
ఉలవ	4,191
పెసర	1,006
అలసంద	151
మినుము	221
సోయాబీన్	551
పొద్దుతిరుగుడు	1,725

ఎంసీఎంసీ.. నిర్లక్ష్యం చేసి

- నిర్దేశిత వివరాలు నమోదు చేయని వైనం
- ఈసీ నుంచి వచ్చిన ఫిర్యాదుపైనా తాత్సారం
- కలెక్టర్ వినోద్‌కుమార్ తీవ్ర ఆగ్రహం

అనంతపురం అర్బన్: ఎన్నికల ప్రక్రియలో కీలకంగా వ్యవహరించాల్సిన ఎంసీఎంసీ (మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ).. తనకు అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించడంలో పూర్తిగా విఫలమైంది. ఇక్కడి అధికారులు 'వస్తినమ్మ... పోతినమ్మ' చందంగా విధులు నిర్వర్తించారు. నిర్దేశించిన వివరాలు నమోదు చేయకపోవడం.. రోజువారీ నివేదికలు రూపొందించకపోవడం వీరి నిర్లక్ష్యపు తీరుకు అద్దం పడుతోంది. ఇక్కడి అధికారుల తీరుపై కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భాలు చాలా ఉన్నాయి.

9న ఆదేశం.. ఇప్పటికీ కానరాని నివేదిక..

ఒక దినపత్రికలో తమ గురించి తప్పుడు వార్త ప్రచురించారంటూ ఎన్నికల సంఘానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై నివేదిక అందించాలని ఎన్నికల సంఘం ఈనెల 9న జిల్లా ఎన్నికల అధికారిని ఆదేశించగా, విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఎంసీఎంసీ అధికారులకు ఆయన సూచించారు. అయినా, ఇప్పటికీ నివేదిక పంపలేదు. దీనిపై కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

పెయిడ్ న్యూస్ పట్టలేదు..

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ప్రచారంలో భాగంగా ప్రకటనలు ఇస్తుంటారు. ఇదే క్రమంలో ఎన్నికల ఖర్చు తగ్గించి చూపేందుకు ప్రకటనలనూ వార్త రూపంలో ప్రచురించేలా, వార్తా చానళ్లలో వాటి యాజమాన్యంతో ఒప్పందం చేసుకుంటారు. ఇలాంటి వార్తలను పెయిడ్ న్యూస్‌గా పరిగణించాల్సి ఉంటుంది. దానిని ప్రకటనగా నిర్ధారించి సంబంధిత అభ్యర్థి ఎన్నికల ఖర్చులో నమోదు చేయాలి. ఇక సోషల్ మీడియాలో అభ్యర్థులు విపరీతంగా ప్రచారం చేసుకున్నారు. వీటిని ఎంసీఎంసీ గుర్తించి నమోదు చేయాల్సి ఉండగా, ఈ విషయంలోనూ మొక్కుబడిగా బాధ్యతలు నిర్వర్తించిందనే విమర్శలున్నాయి. అభ్యర్థులకు సంబంధించి పెయిడ్ న్యూస్, ప్రచార ప్రకటనలు కలిపి కేవలం 101గా చూపించారు. వీటి విలువ రూ.9,94,857గా నిర్ధారించారు. వాస్తవంగా కొన్ని దినపత్రికల్లో కొందరు అభ్యర్థులకు సంబంధించి పెయిడ్ న్యూస్ చాలానే వచ్చినా, ఏవీ నమోదు చేయలేదనేది స్పష్టమవుతోంది.

రోజువారీ విధుల నిర్వహణలోనూ నిర్లక్ష్యమే..

విధులకు సంబంధించి రోజువారీ నివేదికలను కూడా ఎంసీఎంసీ సక్రమంగా రూపొందించలేదని తెలిసింది. అభ్యర్థుల ఎన్నికల ప్రచారానికి సంబంధించి అనుమతులు, రోజువారీగా దినపత్రికలు, చానళ్లలో, సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు, పెయిడ్ న్యూస్‌కు సంబంధించి రోజువారీ నివేదికలను సిద్ధం చేయాలి. అవి ఏ నియోజవర్గానికి సంబంధించిన అభ్యర్థులవి అనేది నివేదికలో పొందుపర్చాలి. వాటి విలువ ఎంత అనేది నిర్ధారించి అకౌంటింగ్ బృందానికి పంపించాలి. అయితే ఇలాంటి తంతు ఏదీ పూర్తిస్థాయిలో నిర్వర్తించలేదంటే ఎంసీఎంసీలోని సిబ్బంది విధుల్లో ఎంత నిర్లక్ష్యం ప్రదర్శించారో అర్థం చేసుకోవచ్చు.

కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిస్తాం

- శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు
- నూతన ఎస్పీ గౌతమి శాలి



పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరిస్తున్న ఎస్పీ గౌతమి శాలి



బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ గౌతమి శాలి

అనంతపురం: జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేలా చర్యలు చేపడతామని ఎస్పీ గౌతమిశాలి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కాన్ఫరెన్స్ హాలులో మీడియాతో మాట్లాడారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రణాళికతో ముందుకెళ్తామన్నారు. ఇందుకు అన్ని వర్గాల ప్రజల సహకారం తీసుకుంటామని తెలిపారు. క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి తగిన ఆదేశాలు జారీ చేసి ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు కృషి చేస్తామన్నారు. ఏ విషయంలోనైనా చట్టపరంగానే ముందుకెళ్తామన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు స్ట్రాంగ్ రూంల వద్ద మూడంచెల భద్రత కొనసాగుతోందని, కౌంటింగ్ రోజు అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం జేఎన్‌టీయూలో స్ట్రాంగ్ రూంలను ఆమె పరిశీలించారు. కేరళ సాయుధ ప్రత్యేక పోలీసులు, ఏఆర్, సివిల్ పోలీసులతో ఏర్పాటు చేసిన మూడంచెల భద్రతపై సమీక్షించారు. పార్కింగ్ స్థలాన్ని స్ట్రాంగ్ రూంలకు దూరంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని గేట్ల వద్ద బందోబస్తు కోసం సిబ్బందిని నియమించాలని సూచించారు. అంతకుముందు ఆమెకు జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, డీఎస్పీలు ప్రతాప్, మునిరాజ, సీఐలు రెడ్డప్ప, ప్రతాప్‌రెడ్డి, జాకీర్‌హుస్సేన్, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో పర్యటన

తాడిపత్రి అర్బన్: తాడిపత్రి పట్టణంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పడమే తమ ముందున్న లక్ష్యమని ఎస్పీ గౌతమిశాలి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ఆమె పట్టణంలో పర్యటించారు. డీఐజీ షిమోషీ వాజ్‌పేయితో సమావేశమయ్యారు. ప్రస్తుత పరిస్థితులపై ఇద్దరూ చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే పెద్దారెడ్డి, జేసీ ప్రభాకర్‌రెడ్డి నివాస ప్రాంతాలను ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కల్గించే వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. పట్టణంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అందులో భాగంగానే ఏపీఎస్పీ బెటాలియన్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సు, బీఎస్ఎఫ్ జవాన్లను అందుబాటులో ఉంచామన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. ఎక్కడైనా అసాంఘిక శక్తులు తోక జాడిస్తే ఉక్కుపాదంతో అణచివేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎద్దుల బండి దూసుకెళ్లి యువకుడికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు శివారులో ఆదివారం ఎద్దులు బెదిరి బండి బస్టాప్‌లోకి దూసుకెళ్లడంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... తొండపాడు నివాసి అజయ్‌కుమార్ ఆదివారం వ్యవసాయ పనులు ముగించుకుని ఎద్దుల బండిలో ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. గ్రామ సమీపంలోకి చేరుకోగానే ఎద్దులు బెదిరి ఒక్కసారిగా బస్టాప్‌లోకి దూసుకెళ్లాయి. ఆ సమయంలో ఎద్దులను అదుపు చేసే క్రమంలో బండి తగిలి తీవ్రంగా గాయపడిన అజయ్‌కుమార్‌ను స్థానికులు వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కన్నతల్లిపై కొడవలితో దాడి

రాయదుర్గం టౌన్: కన్నతల్లిపైనే కొడవలితో దాడి చేసిన ఘటన రాయదుర్గంలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గంలోని వాల్మీకినగర్‌లో నివాసముంటున్న రత్నమ్మకు భర్త, ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు ఎర్రిస్వామి ఆదివారం మధ్యాహ్నం ఇంట్లోనే కొడవలితో తల్లిపై దాడి చేశాడు. ఘటనలో తల, మెడపై తీవ్ర గాయాలయ్యాయి. దాడి నుంచి కాపాడిన స్థానికులు వెంటనే ఆమెను స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, వివాహేతర సంబంధమే దాడికి కారణంగా ప్రాథమిక విచారణలో పోలీసులు నిర్ధారించారు. దాడికి పాల్పడిన ఎర్రిస్వామిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

చెరువులో పడి బాలుడి మృతి



ఇమామ్‌బాషా మృతదేహం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని చిక్కవడియార్ చెరువులో పడి ఓ బాలుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బుక్కరాయసముద్రంలోని ఇందిరమ్మ కాలనీకు చెందిన అరుణ, రజాక్‌వలి కుమారుడు ఇమామ్‌బాషా (12) ఆదివారం ఉదయం స్నేహితులతో కలసి సిద్ధరాంపురం రోడ్డు సమీపంలో ఉన్న చెరువులోకి ఈతకు వెళ్లాడు. ఈత రాని ఇమామ్‌బాషా లోతైన ప్రాంతానికి వెళ్లడంతో నీట మునిగిపోయారు. స్నేహితుల నుంచి సమాచారం అందుకున్న తల్లిదండ్రులు, బంధువులు అక్కడకు చేరుకుని గాలింపు చేపట్టి చివరకు ఇమామ్‌బాషా మృతదేహాన్ని వెలికి తీశారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఊపందుకున్న 'ఉపాధి'

- రోజుకు లక్షకు పైగా కూలీలకు పనులు
- రాష్ట్రంలోనే అనంత జిల్లాకు అగ్రస్థానం
- ఏప్రిల్ నుంచి జూన్ 30 వరకు 95 లక్షల పనిదినాల లక్ష్యం
- రూ.72.48 కోట్ల వేతనాల జమ
- గరిష్ట కూలి రూ.300కు పెంపు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

రాయదుర్గం: జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు ఊపందుకున్నాయి. ఏప్రిల్ 1 నుంచి జూన్ 30వ తేదీ వరకూ వ్యవసాయ పనులకు విరామం ఉండడంతో ప్రస్తుతం ఉపాధి పనులు గ్రామీణ కూలీలకు కల్పతరువయ్యాయి. జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి పనులు కల్పిస్తున్నారు. సకాలంలో వేతన బకాయిలు అందుతుండడంతో పనుల్లో పాల్గొనే వారి సంఖ్య రెట్టింపు అయింది. దీంతో ఉపాధి పనుల కల్పనలో రాష్ట్రంలోనే అనంత జిల్లాకు ప్రథమ దక్కింది. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల్లోని 576 గ్రామ పంచాయతీల పరిధిలో 2.52 లక్షల యాక్టివ్ జాబ్‌కార్డులు ఉన్నాయి. 4.41 లక్షల మంది కూలీలు నమోదు చేసుకున్నారు. ఇందులో రోజూ ఉపాధి పనులను లక్షన్నర మంది సద్వినియోగం చేసుకుంటున్నారు.

ఇప్పటికే 31 లక్షల పనిదినాల పూర్తి..

జిల్లా వ్యాప్తంగా 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు 95 లక్షల పనిదినాలను లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటి వరకూ రికార్డుస్థాయిలో 31 లక్షల పనిదినాలు పూర్తయ్యాయి. మిగిలిన 64 లక్షల పనిదినాలను వచ్చే నెలన్నర లోపు పూర్తిచేసేలా ప్రణాళికలు చేపట్టారు. లక్ష్యసాధనలో అనంత జిల్లా రాష్ట్రంలోనే నంబర్ స్థానానికి ఎగబాకింది. గత ఆర్థిక సంవత్సరంలో 90 లక్షల పని దినాలు ఉంటే ఈ సారి 5 లక్షలు పెంచి వలసల నివారణకు పెద్దపీట వేశారు. గరిష్ఠ వేతనంగా రూ.300లు ఉంటే, కూలీలు మాత్రం రూ.261 సగటు వేతనం పొందుతున్నారు.

రూ.72.48 కోట్లు చెల్లింపు..

జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ జరిగిన 31 లక్షల పనిదినాలకు గాను రూ.72.48 కోట్ల మేర నిధులను ప్రభుత్వం చెల్లించింది. భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితం గ్రామసభలు నిర్వహించి అక్కడ పనులకు ఆమోదం తెలిపింది. అమృత్ సరోవర్ పథకంలో భాగంగా చెరువుల సుందరీకరణ, అస్తవ్యస్తంగా, పిచ్చిమొక్కలతో రూపుకోల్పోయిన చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఖరీఫ్‌లో వ్యవసాయ పనులు మొదలు కానుండడంతో పంటకాలువల శుభ్రం, చెక్‌డ్యామ్‌ల్లో పూడికతీత లాంటి పనులకు పెద్దపీటవేశారు.

సంతోషంగా ఉంది



ఉన్న ఊళ్లోనే ఉపాధి లభిస్తోంది. రోజుకు సగటున రూ.261 వేతనం జమ అవుతుంది. రైతులకు ఉపయోగపడేలా పనులు జరుగుతున్నాయి. నిత్యం పని ప్రాంతం జాతరను తలపిస్తోంది.

– జి.తిప్పక్క, ఉపాధి కూలీ, బీఎస్‌హళ్లి

నెలకు రూ.12 వేలు



ఉపాధి పనులు సంతృప్తి స్థాయిలో కల్పిస్తున్నారు. పనులు చేసిన వెంటనే వేతనం కూడా జమ అవుతోంది. ఇంట్లో ఇద్దరు పనికెళితే సగటున రూ.500 జమ అవుతుంది. నెలకు రూ.10 వేల నుంచి రూ.12వేలు అందుకుంటున్నాం.

– ఆదెక్క, ఉపాధి కూలీ, ఉదేగోళం

మొదటి స్థానంలో జిల్లా



ఉపాధి పనుల కల్పన అంశంలో రాష్ట్రంలోనే అనంత జిల్లాకు ప్రథమ స్థానంలో నిలిచింది. ఇది చాలా సంతోషకరం. రోజుకు లక్షన్నర మందికి పైగా పనులు కల్పిస్తున్నాం. పైసా బకాయి లేకుండా వేతనం జమ చేస్తున్నాం. ముఖ్యంగా వలసలు అనే మాట ఎక్కడేగాని వినిపించకుండా చర్యలు తీసుకున్నాం.

– వేణుగోపాలరెడ్డి, డ్వామా పీడీ

విద్యుదాఘాతంతో వివాహిత మృతి



చైతన్య (ఫైల్)

బెళుగుప్ప: విద్యుత్ షాక్‌కు గురై ఓ వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... బెళుగుప్ప మండలం విరుపాపల్లికి చెందిన బోయ మారుతి, చైతన్య (22) దంపతులు. వీరికి హేమతేజ, ధరమ్‌తేజ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆదివారం ఉదయం ఇంటిపైనున్న ట్యాంక్‌లో నీళ్లు అయిపోవడంతో విద్యుత్ మోటార్ ఆన్ చేసేందుకు చైతన్య వెళ్లింది. అయితే అప్పటికే స్టార్టర్ పెట్టెకు విద్యుత్ సరఫరా అవుతున్న విషయం తెలియని ఆమె నేరుగా వెళ్లి స్విచ్ నొక్కింది. దీంతో షాక్‌కు గురై ఒక్కసారిగా కుప్పకూలింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తల్లి రత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు.

ఊరంతా సుంకులమ్మ, ముత్యాలయ్యలే



రామరాజుపల్లిలోని సుంకులమ్మ, ముత్యాలయ్య ఆలయం



రామరాజుపల్లి వ్యూ

- గ్రామంలో ప్రతి ఇంటా ఇద్దరు, ముగ్గురికి గ్రామదేవతల పేర్లు

SOMETHING SPECIAL

పామిడి: ఏ పల్లెలోనైనా ఒకే పేరు ఉన్న వారు ఐదారు మంది ఉంటే గొప్ప. అలాంటిది ఆ ఊళ్లో దాదాపు వెయ్యి మందికి పైగా ఒకే పేరు పెట్టుకున్నారు. సుంకులమ్మ అనో... ముత్యాలయ్య అనో కేక వేస్తే చాలు పదుల సంఖ్యలో పోగవుతారు. తమ ఇలవేల్పును నిత్యం స్మరించేలా ఇలా గ్రామ దేవతల పేర్లు పెట్టామని వారి తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇంతకు ఆ గ్రామం ఏదంటే... పామిడి మండలం రామరాజుపల్లి. గ్రామంలో 400 కుటుంబాలకు గాను 1,600 మంది జనాభా ఉన్నారు. వీరిలో ఓ వెయ్యి మందికి ముత్యాలయ్య, ముత్యాలరెడ్డి, ముత్యాలమ్మ పేర్లు ఉన్నాయి. అలాగే మరో 400 మందికి సుంకులమ్మ, సుంకిరెడ్డి, సుంకన్న తదితర పేర్లు ఉన్నాయి. ఇంత మంది ఒకే పేరు పెట్టుకోవడానికి కారణం ఏమని ఆరా తీస్తే.. ఆ గ్రామస్తులు ఓ పురాతన కథ వినిపిస్తున్నారు. ఆ కథ ఏమిటో తెలుసుకుందాం రండి...

అక్కాతమ్ముళ్లుగా జన్మించి...

రామరాజుపల్లి గ్రామం ఏర్పడినప్పుడు రెడ్ల సామాజిక వర్గానికి చెందిన గణేశం వంశంలో సుంకులమ్మ, ముత్యాలయ్య అక్క, తమ్ముడిగా జన్మించారు. దైవాంశసంభూతులైన వారి మహిమతో గ్రామం సస్యశ్యామలంగా ఉంటూ వచ్చింది. గ్రామంలో ఎవరికి ఏ సమస్య వచ్చిన వారు తీరుస్తూ వచ్చారు. దీంతో స్థానికులు వారిని గ్రామ దేవతలుగా ఆరాధించేవారు. కాలక్రమేణ వారు అంతర్ధానమైన తర్వాత గ్రామంలో ఆలయాన్ని నిర్మించి, నిత్య పూజలు చేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తమ ఇలవేల్పు పేరును సదా స్మరించేలా తమ సంతానానికి గ్రామ దేవతల పేర్లు పెడుతూ వచ్చారు.

ఏటా తిరునాల..

దాదాపు 250 సంవత్సరాలుగా రామరాజుపల్లిలో సుంకులమ్మ, ముత్యాలయ్య తిరునాలను ఏటా నిర్వహిస్తూ వస్తున్నారు. రామరాజుపల్లి, కాశేపల్లి, గుత్తి అనంతపురం గ్రామాల మధ్య ఐదురోజుల పాటు సాగే ఈ తిరునాలకు జిల్లా వాసులతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక, తెలంగాణ నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. తిరునాలలో ప్రధానంగా బండికి తాటిచెట్టు కాండాన్ని తాళ్లతో కట్టి అలంకరించి రథంగా భావిస్తారు. అనంతరం ఏడు జతల ఎద్దులను కట్టి రామరాజుపల్లి, కాశేపల్లి, గుత్తి అనంతపురం వరకూ లాగిస్తారు. ఎద్దులు బండిని లాగే క్రమంలో తాటి చెట్టు కాండం పైపైకి లేస్తూ ఉంటుంది. ఎద్దులు ఎంత బలంగా బండిని లాగితే కాండం అంత పైకి లేస్తుంది. ఆ సమయంలో రథం వెంబడి సుంకులమ్మ, ముత్యాలయ్య ఉత్సవ మూర్తులను చిలకమ్మ పల్లకీలో ఊరేగింపుగా తీసుకెళ్తారు. తొలిరోజు గుత్తి అనంతపురానికి చేరిన రథం మరుసటి రోజు రాత్రికి రామరాజుపల్లికి చేరుతుంది. తిరిగి మూడోరోజు రాత్రికి బయలుదేరి నాల్గో రోజుకు గుత్తి అనంతపురానికి చేరుతుంది. ఆ రోజు రాత్రి అక్కడే బస చేస్తారు. ఐదో రోజు తెల్లవారుజామున తిరిగి బండిని రామరాజుపల్లికి చేర్చడంతో తిరునాల ముగుస్తుంది. ముగింపు రోజున గ్రామంలో దేవర నిర్వహించి, మొక్కులు తీర్చుకుంటారు.

ఈ నెల 22 నుంచి తిరునాల ప్రారంభం..

రామరాజుపల్లిలో ఈ నెల 22వ తేదీ గ్రామదేవత తిరునాల ప్రారంభం కానుంది. ఈ మేరకు గ్రామ సర్పంచ్ డీసీ ముత్యాలరెడ్డి, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. 26వ తేదీ ఆదివారం వరకూ తిరునాల ఉంటుందని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు ఉమాపతి

తాడిపత్రి: పట్టణంలో జరిగిన అల్లర్లకు బాధ్యులను వదిలి బాధితులపైనే కేసులు నమోదు చేసిన పోలీసుల వైఖరి ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులాంటిదని జిల్లా వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు ఉమాపతి ఖండించారు. తాడిపత్రి ఘటనల్లో టీడీపీకి అనుకూలంగా వ్యవహరించిన పోలీసులకు సంబంధించిన ఆధారాలను ఆదివారం తాడిపత్రికి విచ్చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సతీమణి రమాదేవితో కలసి ఆయన అందజేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంట్లో అర్ధరాత్రి పోలీసుల చొరబడి విధ్వంసానికి పూనుకోవడం అత్యంత దారుణమన్నారు. పోలీసులే గూండాలుగా మారి ఆస్తులు ధ్వంసం చేయడం జిల్లా చరిత్రలో ఇప్పటి వరకూ ఎన్నడూ చోటు చేసుకోలేదన్నారు. ఈ దాడులు, అల్లర్ల వెనుక నారా చంద్రబాబు, నారా లోకేష్, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి హస్తం ఉందని అనుమానాలు వ్యక్తం చేశారు. అప్పటి ఎస్పీ అమిత్‌బర్దర్, ఏఎస్పీ రామకృష్ణ ఆధ్వర్యంలోనే ఈ దాడులు జరిగాయని ఆరోపించారు. సిట్ అధికారులు నిష్పక్షపాతంగా దర్యాప్తు కొనసాగించి, భవిష్యత్తులో తాడిపత్రిని ప్రశాంతంగా ఉంచేలా చేయాలని కోరారు. న్యాయవాది సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.... తాడిపత్రిలో చోటు చేసుకున్న ఘటనపై సిట్ దర్యాప్తునకు ఎన్నికల కమిషన్ ఆదేశించడం సంతోషకరమన్నారు. సిట్ అధికారి ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావును లీగల్ సెల్ తరఫున కలసి తాడిపత్రిలో జరిగిన అల్లర్లకు కారణాలు, పోలింగ్ రోజు ఏమి జరిగిందనే అంశాలను వివరించామన్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను సిట్ అధికారులకు అందజేశామన్నారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి సతీమణి రమాదేవి కూడా ఇదే విషయాలను సిట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో తాడిపత్రి లీగల్ సెల్ ప్రెసిడెంట్ ప్రభుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్ష తగదు



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డాక్టర్ అనుపమజేమ్స్

అనంతపురం మెడికల్: హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారి పట్ల వివక్ష తగదని, వారి పట్ల ప్రేమ, ఆదరణ కలిగి ఉండాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమజేమ్స్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే సందర్భంగా ఆదివారం ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ప్రపంచ వ్యాప్తంగా హెచ్‌ఐవీతో మరణించిన వారికి సంఘీభావం తెలిపేందుకు, హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారి పట్ల వివక్షను రూపు మాపేందుకు అందుబాటులో ఉన్న సేవలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో హెచ్‌ఐవీ కౌన్సిలింగ్, చికిత్స, ఇతర పరీక్షలు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. హెచ్‌ఐవీ బాధితుల పట్ల ఎవరైనా వివక్ష చూపితే చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం డీపీఎం వెంకటరత్నం, సూపర్‌వైజర్ జీవీ రమణ, పీఎంఓ నాగన్న, హెచ్‌ఈఓ సత్యనారాయణ, ఎయిడ్స్ నియంత్రణ విభాగం సిబ్బంది నారాయణస్వామి, మురళి, ఐసీటీఎస్ కౌన్సిలర్ సుబ్బారెడ్డి, అనంత నెట్‌వర్క్ రామాంజినేయులు, నెట్వర్క్ సిబ్బంది ఈశ్వరయ్య, రాంబాబు, లింక్ వర్కర్ డీఆర్‌పీ రమేష్, రిడ్స్ స్వచ్ఛంద సంస్థ నరేష్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి జయంతి



నీలం సంజీవరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి జయంతి సందర్భంగా ఆదివారం గార్లదిన్నె మండలం కల్లూరులో వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన కూడలిలో ఉన్న నీలం సంజీవరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రముఖులు తరిమెల కోనారెడ్డి, మాజీ ఎంపీపీ ప్రదీప్‌రెడ్డి, నల్లపరెడ్డి, జంబులదిన్నె సొసైటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, గట్టు రామకృష్ణారెడ్డి, పెద్దన్న, చంద్రనాథ్‌రెడ్డి, నల్లప్ప, సంజప్ప, చితంబరరెడ్డి, ఏకే నరసింహులు, బృందావన్ రామాంజనేయులు, చీమల కేశవయ్య, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే ఆకుతోటపల్లిలో భారీ చోరీ



దొంగతనం జరిగిన ఇల్లు ఇదే

రాప్తాడు రూరల్: తాళం వేసిన ఇంట్లో చొరబడి రూ.లక్షల విలువైన బంగారు నగలు, అదే స్థాయిలో నగదు అపహరించుకెళ్లిన ఘటన అనంతపురం నగర శివారులో సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లికి చెందిన కిరణ్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. ఆదివారం ఉదయం 7 గంటలకు ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలసి కుర్లపల్లి మల్లేశ్వరస్వామి ఆలయానికి వెళ్లాడు. తిరిగి 10.45 గంటలకు ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే ఇంట్లోకి చొరబడిన దుండగులు బీరువాలోని 18 తులాల బంగారు నగలు, రూ.10 లక్షల నగదు అపహరించుకెళ్లారు. సమాచారం అందుకున్న ఇటుకలపల్లి సీఐ నరేంద్రరెడ్డి, ఎస్‌ఐ రాఘవేంద్రరెడ్డి, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. స్నిప్పర్ డాగ్‌ను రంగంలో దించారు. క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. సమీపంలోని సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ నరేంద్రరెడ్డి తెలిపారు.

అనుమానాలెన్నో...

దొంగతనంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చెన్నై జాతీయ రహదారి పక్కనే ఈ ఇంటి పరిసరాల్లో అనుక్షణం ప్రజలు తిరుగుతూనే ఉంటారు. అలాంటిది పట్టపగలే దొంగతనం ఎలా జరిగిందనే దానిపై పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. దీనికి తోడు కిరణ్ ఇంటికి వేసిన తాళం దెబ్బతినకుండా తీయడం, లోపల బీరువా కూడా ఎలాంటి దెబ్బతినలేదు. దీంతో ఇంటి దొంగల పనిగానే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

'ఆపస్' జిల్లా కమిటీలో చోటు



శివప్రసాద్‌నాయుడు



ఆదిశేషయ్య

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా కమిటీలో ఇద్దరికి చోటు కల్పించారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం జిల్లా కోర్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఊబిచెర్ల పాఠశాల టీచరు పి.శివప్రసాద్‌నాయుడును, జిల్లా కార్యదర్శిగా సంజీవపురం బీసీ కాలనీ పాఠశాల టీచరు ఎస్.ఆదిశేషయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిని సంఘం ప్రతినిధులు అభినందించారు. సమావేశంలో ఆపస్ రాష్ట్ర గౌరవసలహాదారు టి.వెంకటేశ్వరప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి బి.రాజేంద్రప్రసాద్, జిల్లా అధ్యక్షురాలు కళ్యాణి, ప్రధానకార్యదర్శి ఎర్రిస్వామి, కోశాధికారి రాఘవేంద్రగుప్తా, ఉపాధ్యక్షుడు హర్షవర్ధన్ పాల్గొన్నారు.

వ్యక్తి దుర్మరణం

కనగానపల్లి: ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కనగానపల్లికి చెందిన కందుకూరు కిష్టప్ప(54) ఆదివారం సాయంత్రం మామిళ్లపల్లి నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యంలో ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొన్నాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన కిష్టప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన మరో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరు యువకులకూ గాయాలయ్యాయి. మృతుడికి భార్య లక్ష్మీదేవి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

సర్పరూపుడికి పంచామృతాభిషేకాలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయంలో స్వామి మూలవిరాట్‌కు ఆకుపూజలు అనంతరం పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఉత్సవ విగ్రహాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ప్రదక్షిణలు చేయించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కాలసర్పదోష నివారణ రాహు కేతు హోమాలు నిర్వహించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేపట్టారు. మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు.

గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కనగానపల్లి: సార్వత్రికల ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు రాజకీయ పార్టీల నాయకులను హెచ్చరించారు. శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా ఆదివారం రామగిరి సీఐ శివాంజనేయులు, కనగానపల్లి ఎస్ఐ మల్లికార్జునరెడ్డి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ముత్తవకుంట్ల, యలకుంట్ల, బద్దలాపురం, భానుకోట గ్రామాల్లో రాజకీయ పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం ఇరుపార్టీల నాయకులను స్థానిక పోలీస్ స్టేషన్‌కు పిలిపించుకుని మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. రాజకీయ వైషమ్యాలతో ఒకరిపై ఒకరు గొడవలకు పాల్పడితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్థికసాయం అందజేత



నాగరాజుకు నగదు అందజేస్తున్న డాక్టర్ నిర్మలమురళి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం రాజీవ్‌కాలనీ పంచాయతీ భగత్‌సింగ్ నగర్‌కు చెందిన నాగరాజు ఆటోడ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగించేవాడు. ఇటీవల పక్షపాతంతో కుడికాలు, కుడి చేయి పని చేయడం లేదు. కుటుంబ పోషణ భారంగా మారింది. విషయం తెలుసుకున్న నిత్యసురభి ట్రస్ట్ చైర్ పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆదివారం రూ.10 వేల నగదును బాధితుడు నాగరాజుకు అందజేశారు.

పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్..



పాఠ్యపుస్తకాలను దించుతున్న దృశ్యం

ఆత్మకూరు: ఈ ఏడాది పాఠశాలలు పునఃప్రారంభం కాకముందే పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్. ఆదివారం పెద్ద ట్రక్‌లో వచ్చిన పాఠ్యపుస్తకాలను మండల కేంద్రంలో భద్రపరిచారు. 6వ తరగతికి సంబంధించి తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టుల పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు ఎంఈఓ నరసింహారెడ్డి తెలిపారు. ప్రస్తుతం 1,208 పాఠ్యపుస్తకాలు వచ్చాయని.. మిగిలిన తరగతులకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు త్వరలోనే వస్తాయన్నారు.

విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

ఆత్మకూరు: విత్తన వేరుశనగ కావాల్సిన వారు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుచరిత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ తీసుకెళ్లాలన్నారు.





నేతాజీ పార్క్‌లో పనులు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశిస్తున్న ఏడీఏ లక్ష్మీప్రసన్న, నేతాజీ పార్క్‌లో జరుగుతున్న పనులు



జేసీబీతో మట్టి చదును పనులు చేస్తున్న దృశ్యం

అభివృద్ధి పనుల జోరు

అనంతపురం కార్పొరేషన్: పాలకవర్గం, నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశాలతో నగరంలోని కొన్ని పార్కుల్లో అభివృద్ధి పనులు మొదలయ్యాయి. ఎన్నికల హడావుడిలో పనుల జాప్యం జరిగింది. ఇటీవల నగరంలోని సాయినగర్ వివేకానంద పార్క్, రాంనగర్ సిద్దార్థ పార్క్, 50వ డివిజన్‌లో ఉమెన్స్ పార్క్‌లో పనులు ప్రారంభమయ్యాయి. నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.25 లక్షలతో ఉమెన్స్ పార్క్, ఎస్ క్యాప్ నిధులు రూ.30 లక్షలతో సాయినగర్‌లోని వివేకానంద పార్క్, రూ.23 లక్షలతో సిద్ధార్థ పార్క్‌లో అభివృద్ధి పనులు చేపట్టేలా పాలకవర్గం చర్యలు తీసుకుంది. కాగా ఈ పార్క్‌ల్లో వాకింగ్ ట్రాక్, ప్రహరీగోడ, మొక్కలు, పెయింటింగ్, డిజిటల్ నేమ్ బోర్డులు తదితర వాటిని ఏర్పాటు చేయనున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం నగరపాలక సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ హార్టికల్చర్ లక్ష్మీప్రసన్న పార్క్‌ల్లో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు.



ఉమెన్స్ పార్క్‌లో ముమ్మరంగా జరుగుతున్న పనులు





రాంనగర్‌లో..

ఘంటసాలకు స్వర నీరాజనం

- 101 పాటలతో ఆకట్టుకున్న గాయనీ గాయకులు

అనంతపురం కల్చరల్: ఏకబిగిన 12 గంటల పాటు నిర్విరామంగా సాగిన ఘంటసాల స్వరనీరాజనం అనంత వాసులను అమితంగా ఆకట్టుకుంది. జిల్లాలో తొలిసారి 8 సాంస్కృతిక సంస్థలు ఒకే వేదికపై నిలిచి స్వర నీరాజనం పేరుతో అమర గాయకుడు ఘంటసాలకు ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం కావడంతో పాత పాటల ప్రేమికులు, సంగీత ప్రియులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆపాత మధురాలకు వేదికగా నిలిచిన లలిత కళాపరిషత్తు కిటకిటలాడింది. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సాగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన 'ఘంటసాల ది గ్రేట్' బయోపిక్‌ను నిర్మించిన సినీ నిర్మాత, దర్శకులు సీహెచ్ రామారావు అనంత వాసుల కృషిని అభినందించారు. అదే విధంగా ఎల్కేపీ అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య, కార్యదర్శి పద్మజ, రవికాంత్ రమణ మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే అరుదైన ఘంటసాల విగ్రహాన్ని పాత పాటల సమూహం వారితో కలిసి అనేక సాంస్కృతిక సంస్థలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గంటసాల జయంతి, వర్ధంతులను క్రమం తప్పకుండా నిర్వహిస్తుండటం స్ఫూర్తిదాయకమన్నారు. నిర్వాహకులు ఘంటసాల రామయ్య, ఓబుళదాసు మాట్లాడుతూ.. మానసిక ప్రశాంతతను పెంచే పాత పాటలు ఎక్కడ విన్నా శ్రోతలు ఆనందంలో తేలిపోతారన్నారు.



పాటలు పడుతున్న గాయకులు

ఆకట్టుకున్న పాత పాటలు..

జిల్లా వ్యాప్తంగా తరలి వచ్చిన వందలాది మంది గాయనీ గాయకులు ఘంటసాల ఆలపించిన 101 పాటలతో సినిమాను తలపిస్తూ అలరించారు. ముఖ్యంగా సీనియర్ గాయనీ గాయకులు పాలసముద్రం నాగరాజు, బాలమురళీకృష్ణ, కేవీ మహీధర్, చరణ్, జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, సురేష్, ప్రొఫెసర్ సుధాకర్ బాబు శ్రీదేవి, బృంద, పద్మ, లక్ష్మీనారాయణ, సూర్యనారాయణరెడ్డి తదితరులు పాత పాటలను అద్భుతంగా ఆలపించారు. అదిగో నవలోకం.. నన్నుదోచుకుందువటే.. రాజశేఖర నీపై మోజు తీరలేదురా వంటి పాటలు, ఘంటసాల పద్యాలతో అలరించారు. ఇకపై ప్రత్యేక దినాలలో అన్ని సంస్థలు కలిసి పని చేయాలని తీర్మానించాయి. అనంతరం ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన పలువురు సామాజిక సేవా కార్యకర్తలు, అధికారులను నిర్వాహకులు సత్కరించారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

అనంతపురం కల్చరల్: ధ్యానం, జపంతో మనసు ఉల్లాసంగా మారి ప్రత్యేక శక్తినిస్తుందని యోగా గురువు హనుమంతరెడ్డి అన్నారు. స్థానిక రామచంద్రా నగర్‌లోని వివేకానంద భవన్‌లో ఆదివారం శ్రీరామనామ ధ్యాన జపం జరిగింది. ముఖ్య ప్రసంగికుడిగా పాల్గొన్న యోగా గురువు హనుమంతరెడ్డి మంత్ర సిద్ధి, ధ్యాన సిద్ధి, ఆసన సిద్ధి తదితర విషయాల ప్రాముఖ్యతను వివరించారు. ఒత్తిడితో నిండిపోతున్న శరీరాలకు యోగాసనాలు, ధ్యానాన్ని మించిన ఔషధమే లేదన్నారు. దురదృష్టవశాత్తూ చాలా మంది మందులతో శరీరాన్ని గుల్ల చేసుకుంటున్నారని విచారం వ్యక్తం చేశారు. క్రమశిక్షణాయుత జీవన విధానాన్ని అందరూ అలవరచుకోవాలన్నారు. అప్పుడే ఆరోగ్యకర సమాజాన్ని పొందగలుగుతామన్నారు. కేంద్రం అధ్యక్షుడు మెళవాయి రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ.. వివేకానంద యోగా కేంద్రం వారు ఎటువంటి రుసుము తీసుకోకుండా నగరంలో చాలా చోట్ల ఉచితంగా యోగ, ధ్యానం నేర్పిస్తున్నారని తెలిపారు. అంతకు ముందు ఓంకారం, శ్రీరామనామ జపంతో యోగా భవనం మార్మోగింది. కార్యక్రమంలో యోగ కేంద్ర సాధకులు గురురాజ్, సుశీల, తారక్, మారుతి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



ధ్యాన్య శిబిరంలో పాల్గొన్న యోగా గురువులు

అధైర్య పడద్దు..అండగా ఉంటాం

అనంతపురం కార్పొరేషన్: శుభకార్యం జరగాల్సిన ఇంట విషాదం చోటుచేసుకోవడం బాధాకరం. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని మేయర్ వసీం పేర్కొన్నారు. నగరంలోని బిందెల కాలనీకి చెందిన షేక్ ఫిరోజ్‌తో పాటు 5 మంది శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విధితమే. మేయర్ వసీం, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ తదితరులు ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని అన్ని విధాల ఆదుకుంటామని తెలిపారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్ని విధాల ఆదుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఆరు మంది ప్రమాదంలో మృతి చెందడం, అందులోనూ ఇద్దరు చిన్నారులు ఉండడం ఎంతో కలచి వేసిందన్నారు. వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన దురదృష్టకరమన్నారు. అల్లా వారి కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని ప్రసాదించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కమల్‌భూషణ్, 2వ డివిజన్ కన్వీనర్ బోయ రవికుమార్, నాయకులు అల్తాఫ్, రాజశేఖర్ రెడ్డి, రామకృష్ణా రెడ్డి, బిందెల నాగేంద్ర, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మృతుల కుటుంబీకులను ఓదారుస్తున్న మేయర్ వసీం, వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు కాగజ్‌ఘర్ రిజ్వాన్

విశ్రాంత ఉద్యోగుల ఔదార్యం

అనంతపురం కల్చరల్: నగరంలోని విశ్రాంత ఉద్యోగులు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. నిత్యం వివిధ పనులపై వచ్చిపోయే వారి దాహార్తి తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. సేవాభావం కలిగిన పది మంది ఉద్యోగులు తలా చందాలు వేసుకుని నగరంలోని నెహ్రూ బాలభవన్ ఎదురుగా చల్లని మజ్జిగ ఇవ్వడం ప్రారంభించారు. మొదట ఓ వంద మందికి చాలనుకున్నా అందరూ అడుగుతుండటంతో ప్రస్తుతం వెయ్యి మందికి మజ్జిగ వితరణ చేస్తున్నారు. వారిళ్లలో పుట్టిన రోజులు, వివాహమహోత్సవం వంటి శుభకార్యాలలో అన్నప్రసాదం కూడా అందిస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. వెల్ఫేర్ డిపార్టుమెంట్‌కు చెందిన విశ్రాంత ఉద్యోగి శ్రీరాములు ఇచ్చిన ఆలోచనకు చంద్రశేఖరరెడ్డి, వీరదివాకర్, సుందరరావు, హనుమంతప్ప, మల్లికార్జున తదితరులు తోడవడంతో మజ్జిగ పంపిణీ సజావుగా సాగుతోంది. సేవాభావం కల్గిన వారు సహకరిస్తే మరింత పెద్ద స్థాయిలో చేయాలని సంకల్పించినట్లు చెబుతున్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న పెన్షనర్లు

26న కామాక్షి దేవి వార్షికోత్సవం

బుక్కరాయసముద్రం: మండలంలోని రెడ్డిపల్లిలో ఈ నెల 26న కామాక్షి దేవి 5వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. 26న ఉదయం 8.30 గంటలకు గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, వనగ్రహ కలశ స్థాపన, నవగ్రహ పూజ, గణపతి నవగ్రహ హోమం నిర్వహిస్తామన్నారు. రాత్రి 9 గంటలకు పంచ రత్నాల నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. 27న ఉదయం 7.30 గంటలకు కామాక్షిదేవి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ నాగవల్లి పూజ, అర్చనలు, మహా మంగళ హారతి, నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. రాత్రి 9 గంటలకు కట్టెల కోలాటం, రాత్రి 2.15కు కామాక్షిదేవి జ్యోతుల ఉత్సవం నిర్వహిస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో నిజరూప దర్శనం



అలంకరణలో రుక్మిణీ విఠల పాండురంగడు

అనంతపురం కల్చరల్: భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో నగరంలోని రామనగర్ రుక్మిణీ పాండురంగ విఠల స్వామి ఆలయంలో ఆదివారం మోహిని ఏకాదశి సందర్భంగా రుక్మిణీ విఠల పాండురంగ నిజరూప దర్శనం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం జరిగిన నిజరూప పాదదర్శనంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.. అంతకు ముందు ఇస్కాన్ వారి నేతృత్వంలో హరినామ సంకీర్తన జరిగింది. హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే అంటూ ఆలయ పరిసరాలు ప్రతిధ్వనించాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రతి ఏకాదశికి నిజరూప దర్శన భాగ్యం భక్తులకు కల్గిస్తున్నట్లు తెలిపారు. భక్తిభావం పెంచేలా ఇకపై ఇస్కాన్ సంకీర్తనామృతం నిర్వహించడానికి ముందుకు వచ్చిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. మహామంగళహారతి అనంతరం ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు దుస్తకర్ తిరుపతిరావు సెక్రటరీ ఆనంద్ మమేంద్రకర్ పాల్గొన్నారు.

పశువులను తరలించరా?



నగరంలో పోట్లాడుకుంటున్న పశువులు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని వివిధ వీధుల్లో పశువులు సంచారంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పశువుల నిర్వాహకులు వాటిని రోడ్లపై వదిలేయడంతో ఎక్కడ పడితే అక్కడ తిష్టవేయడమే కాకుండా బాహాబాహీకి దిగుతున్నాయి. ఎక్కడ కొమ్ములతో పొడుస్తాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎప్పటికప్పుడు గోశాలకు పశువులను తరలించాల్సిన సంబంధిత అధికారులు మీనామేషాలు లెక్కిస్తున్నారు. నగరంలోని అశోక్‌నగర్, వేణుగోపాల్ నగర్, హౌసింగ్ బోర్డు, బుడ్డప్ప నగర్ 1, 2, 3, 4, 5 రోడ్లు, విద్యుత్ నగర్, సాయినగర్, తదితర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో పశువులు సంచరిస్తున్నాయి. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు మేలుకుని చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలి



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్: స్వాతంత్ర్య సమరయోధుడు, ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్యను ఆదర్శంగా తీసుకుని ప్రజాసమస్యలపై పోరాటాలు సాగించాలని సీపీఎం నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక మల్లుస్వరాజ్యం నగర్‌లో సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య 39వ వర్ధంతిని నిర్వహించారు. పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నగర కార్యదర్శి రామిరెడ్డి, ఇతర నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్, వెంకట నారాయణ, మసూద్, బాలకృష్ణ, గఫూర్, వెంకటేష్, మాజీ సర్పంచ్ హుస్సేన్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లోకి ఇన్‌పుట్ సబ్సిడీ

- ఆత్మకూరు మండలానికి రూ.7.91 కోట్లు విడుదల
- ఆనందలో అన్నదాతలు

ఆత్మకూరు: రైతులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. గతేడాదికి సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించేందుకు సీఎం జగన్ మార్చిలో బటన్ నొక్కిన విషయం తెలిసిందే. అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో చెల్లింపులు ఆగిపోయాయి. టీడీపీ నాయకులు కుట్రలు పన్ని వివిధ పథకాల నగదు లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ కాకుండా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీంతో పోలింగ్ ముగిసే వరకూ ఎలాంటి చెల్లింపులు చేయొద్దని ఆదేశాలు జారీ చేసింది. ఇటీవల పోలింగ్ ముగియడంతో వివిధ పథకాల నగదును ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేస్తోంది. సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం రైతన్నలకు ఇన్‌పుట్ సబ్సిడీ, విద్యార్థులకు విద్యాదీవెన, మహిళలకు ఆసరా నగదు ఖాతాల్లో జమ చేశారు.

రైతులకు అందిన పరిహారం ఇలా..			
గ్రామం	రైతులు	హెక్టార్లు	జమ అయిన నగదు
ఆత్మకూరు	1,714	2284	రూ. 2,43,75,457
బి.యాలేరు	82	100	రూ. 10,64,656
మదిగుబ్బ	137	161	రూ.23,25,797
గొరిదిండ్ల	962	1,199	రూ.1,64,17,556
పి.యాలేరు	1,058	1,276	రూ. 1,41,44,501
సనప	474	626	రూ. 77,59,515
తలుపూరు	396	386	రూ. 48,00,416
తొపుదుర్తి	684	543	రూ. 91,94,412
మొత్తం	5,507	6,575	రూ.7,91,27,352



ప్రస్తుతం మండల వ్యాప్తంగా 5,507 మంది రైతులకు 6,575 హెక్టార్లకు సంబంధించి రూ.7,91,27,352 ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలయ్యాయి. సీఎం జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడి రైతలకు ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేశారని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ ఖాతాల్లోకి నగదు జమ అయ్యిందో లేదో తెలుసుకునేందుకు రైతన్నలకు బ్యాంకులకు క్యూ కడుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండటంతో ఇన్‌పుట్ సబ్సిడీ నగదు పంట పెట్టుబడికి ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు. ఖరీఫ్ పంట నష్టపరిహారానికి సంబంధించి హెక్టారు వేరుశనగకు రూ.17 వేలు, ఆముదం, జొన్నకు హెక్టారుకు రూ.8,500, పత్తికి హెక్టారుకు రూ.17,500, కందులు, పెసలుకు హెక్టారుకు రూ.10 వేల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది.



ఆత్మకూరులో డబ్బులు డ్రా చేసుకునేందుకు బ్యాంకు వద్దకు వచ్చిన రైతులు

జగనన్న చెప్పారంటే చేస్తారంతే..



డాక్టర్ వైఎస్సార్ తరువాత రైతుల గురించి ఆలోచించిన మరో సీఎం ఎవరైనా ఉన్నారంటే అది జగనన్న అని చెప్పాలి. ప్రజలకు అందాల్సిన పథకాలు అందకుండా టీడీపీ నాయకులు కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారు. అయినా ఇచ్చిన మాట ప్రకారం రైతుల ఖాతాల్లోకి ఇన్‌పుట్ సబ్సిడీ సొమ్ము జమ అయ్యింది. నాకు రూ.34 వేల ఇన్‌పుట్ సబ్సిడీ అందింది. ఈ నగదు పంటల పెట్టుబడికి ఉపయోగపడుతుంది.

– బాలపోతన్న, రైతు, సిద్దరాంపురం

పంట పెట్టుబడికి సాయంగా..



గత టీడీపీ ప్రభుత్వంలో కేవలం టీడీపీ నాయకులకు మాత్రమే పంట నష్టపరిహారం అందించే వావాళ్లు. కాని ప్రస్తుతం జగనన్న ప్రభుత్వంలో పార్టీలతో సంబంధం లేకుండా పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారాన్ని అందజేశారు. నాకు రూ.16,422 ఇన్‌పుట్ సబ్సిడీ ఖాతాకు జమ అయ్యింది.

– రామచంద్ర, గొరిదిండ్ల తండా

గుత్తిలో 81.2 మి.మీ. వర్షపాతం నమోదు



గాయత్రి వాటర్ ప్లాంట్ ఏరియా వద్ద డ్రైనేజీ కాలువ పొంగి పొర్లుతున్న దృశ్యం

గుత్తి/గుత్తి రూరల్: గుత్తిలో శనివారం సాయంత్రం, రాత్రి భారీ వర్షం కురిసింది. 81.2 మిల్లీమీటర్ల వర్షం పాతం నమోదైనట్లు తహసీల్దార్ భారతి తెలిపారు. లోతట్టు కాలనీలు పూర్తిగా జలమయమైయ్యాయి. గుత్తిలోని గాయత్రి వాటర్ ప్లాంట్ ఏరియా, బీసీ కాలనీ, రవూఫ్ వెల్డింగ్ షాపు ఏరియాల్లో ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. డ్రైనేజీలు పొంగి పొర్లాయి. అలాగే గుత్తి ఆర్ఎస్‌లోని శుద్ధ ఫ్యాక్టరీ కాలనీ పూర్తిగా జలమయమైంది. ఇళ్లలోకి నీరు చేరింది. ఆముదాల గిరిధర్ ఇంటి సమీపంలోని వెంకటసాయి ఆఫ్‌సెట్ ప్రింటర్స్ (ప్రింటింగ్ ప్రెస్)లోకి నీళ్లు చేరాయి. దీంతో నాలుగు మోటార్లు చెడిపోయాయి. సుమారు రూ. 50 వేలు నష్టం వాటిల్లినట్లు ప్రింటింగ్ ప్రెస్ యజమాని వెంకటేష్ వాపోయారు. అధికారులు స్పందించి పరిహారం చెల్లించాలని కోరారు. అయితే చాలా రోజుల తర్వాత భారీ వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే కొత్తపేట, బసినేపల్లి, రజాపురం, లచ్చానుపల్లి, శ్రీపురం, బసినేపల్లి తండా గ్రామాల్లో భారీ వర్షం కురిసింది.